క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. బాల్కొండ నియోజకవర్గంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సమీక్షా సమావేశం మంత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నియోజకవర్గంలో భారీ వర్షాలకు తెగిపోయిన చెరువుల మరమ్మత్తుకు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో

జగిత్యాల: ఉపకేంద్రాల్లో మెరుగైన సేవలందించాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులతో సమావేశం నిర్వహించారు. గ్రామీణస్థాయిలో వైద్యసేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, సతీశ్, శ్రావణి, నాగరాజు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో కమిషనర్ తనిఖీ



కేజీబీవీని సందర్శించిన కమిషనర్

ధర్మపురి: ధర్మపురిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలతో పాటు కస్తూర్బా విద్యాలయాలన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వసతి గృహాల్లో వంట సరుకులను, గదులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తదితరులున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: లగిచర్లలో రైతుకు బేడీలు వేయడాన్ని నిరసిస్తూ బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం కథలాపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. రైతుకు బేడీలు వేయడం దారుణమన్నారు. రైతులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కంటి సత్యనారాయణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

జగిత్యాల: కేజీబీవీ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంఈవో భీమయ్య అన్నారు. శుక్రవారం జగిత్యాలలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు చలికి ఇబ్బందులు పడకుండా దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

బుగ్గారం/ధర్మపురి/రాయికల్: ఈ నెల 17వ తేదీన ఇందిరాపార్క్ వద్ద ధర్మాగ్రహ దీక్ష పోస్టర్‌ను ధర్మపురి ఉన్నతపాఠశాల, యశ్వంతరావుపేట ఉన్నత పాఠశాల, రాయికల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యదర్శి రొట్టె శ్రీనివాస్ జిల్లా బాధ్యులు బండి మహేశ్, కాశెట్టి రమేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చెరుకు మహేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దొంగ మల్లన్న జాతర



దొంగ మల్లన్న జాతరకు తరలివచ్చిన భక్తులు(ఫైల్)

మేడిపల్లి: కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న రాగోజీపేట దొంగ మల్లన్న జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా కేంద్రానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమారం మండల పరిధిలోని రాగోజీపేటలో దొంగ మల్లన్న జాతర ప్రతీ ఏడాది దండి వారం ముగిశాక వచ్చే రెండో శుక్రవారం నుంచి ప్రారంభమై మంగళవారం వరకు జరుగుతుంటాయి. శుక్రవారం గంగ స్నానాలతో మొదలైన మల్లన్న జాతర శనివారం డోలు బాజాలతో అశేష జనసంద్రంతో గ్రామంలోని మల్లన్న గుడి వద్దకు ఎదుర్కొంటారు. అదే రోజు రాత్రి 11 గంటల నుండి గ్రామస్తుల దీప దూప ఆరాధనతో, ఒగ్గు, డప్పు చప్పుళ్లతో దొంగ మల్లన్న గుడి వరకు ఊరేగింపుగా వెళ్లి లగ్గపు పట్నం నిర్వహిస్తారు. తదనంతరం స్వామివారి దర్శనం చేసుకుంటారు. జాతరకు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు గుడి చైర్మన్ జాల మహేశ్ యాదవ్ అన్నారు.

ముఖ్యఘట్టం

దొంగ మల్లన్న జాతరను సుమారు పది తరాల నుంచి జాల కులస్తులు వేడుకలు నిర్వహిస్తున్నారు. 500 ఏళ్ల క్రితం రాత్రికి రాత్రే గుడి నిర్మాణం చేపట్టినట్లు జాల కులస్తులు తెలిపారు. ఆదివారం నాలుగు గంటల నుంచి పెద్ద ఎత్తున రాష్ట్ర నలుమూలల భక్తుల బోనాలతో తరలివస్తారు.తర్వాతి రోజు సోమవారం స్వామి వారి చరిత్ర వివరిస్తారు. మంగళవారం నాగేల్లి అగ్నిగుండం జాతర వేడుకలు నిర్వహిస్తారు.



రాయికల్: మండలంలోని దావన్‌పల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న వ్యవసాయ భూమిలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పలుమార్లు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేశం, ట్రాన్స్‌కో ఏఈ, ఒడ్డెలింగాపూర్ సెల్ నంబర్: 9440851083

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

జగిత్యాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: జగిత్యాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కోసం జగిత్యాలలోని ప్రతీ వార్డుకు నిధులు కేటాయించడం జరిగిందని, జగిత్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టర్లకు రూ.10 కోట్ల పాత బకాయిలు, రాయికల్‌కు రూ.3 కోట్ల బకాయిలు విడుదల చేసినట్లు తెలిపారు. రూ.30 కోట్లతో మళ్లీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ రక్షణ కోసం హైడ్రా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, స్థానిక కౌన్సిలర్లు సింగారావు, హరీశ్, అనిల్, శాగూర్, సుధాకర్, విజయ్, రాజేందర్ పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి

జగిత్యాలరూరల్: నిరుపేదలకు కల్యాణలక్ష్మి వరం లాంటిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన చెట్లపల్లి నాగరాజుకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పులిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

జగిత్యాలటౌన్: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపాలని కోరుతూ సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరారు. ఈమేరకు శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసిన ఉద్యోగులు తమ సమస్యలపై వినతిపత్రం అందజేసి పరిష్కారానికి సహకరించాల్సిందిగా కోరారు. వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన జీవన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కాగా చేయాలి

పెగడపల్లి: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా చేయాలని తప్పకుండా లబ్ధిదారుల ఫొటోను తీయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏడుమోటలపల్లి, రాజరాంపల్లి, ఎల్లాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఇళ్ల సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. దరఖాస్తుదారు ఇంటికి వెళ్లిన వివరాలు సేకరించిన ఎంపీడీవో దరఖాస్తుదారుల ఫొటోలను తీసిన ఆయన యాప్‌లో అప్లోడ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తప్పులు లేకుండా వివరాలు సేకరించాలని, అన్ని వివరాలు నమోదు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఆంజనేయులు, రజనీకుమార్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యాదవ విద్యావంతుల ఫోరం జిల్లా కన్వీనర్‌గా ప్రశాంత్

సారంగాపూర్: తెలంగాణ యాదవ విద్యావంతుల ఫోరం జగిత్యాల జిల్లా కన్వీనర్‌గా బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెకు చెందిన గొర్ల ప్రశాంత్ యాదవ్ నియమితులయ్యారు. కో కన్వీనర్‌గా గొడుగు మదుసూదన్ ఎన్నికయ్యారు. విద్యావంతుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై కాలయాపన చేయొద్దు



ర్యాలీ తీస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోరుట్ల: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా అసెంబ్లీలో తీర్మానం పెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కోరుట్లలో నాయకులు, డప్పు కళాకారులు, సింధు మాదిగలు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే ముందు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి అమలు చేస్తామని వాగ్దానం చేశారని, ఉద్యోగాల భర్తీలో కూడా వర్గీకరణ అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు కమిటీ వేశారని పేర్కొన్నారు. కాలయాపన కోసమే కమిటీ ఏర్పాటు చేశారని, కమిటీలతో సంబంధం లేకుండా వర్గీకరణ చేపట్టాలని కోరారు. ప్రధాన కార్యదర్శి వనతడుపుల అంజయ్య, కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, నాయకులు కొంతం రాజం, రాజశేఖర్, పేట భాస్కర్, రాజేశ్, లక్ష్మణ్, శనిగరపు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

- **వసతి గృహం సందర్శన**

పెగడపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. వంటగది, వంట సరుకులు, మరుగుదొడ్లు, వసతులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి భోజనంలో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, కావాల్సిన వసతులపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, మహేశ్, తిరుపతి పాల్గొన్నారు.

- **వికలాంగుడికి వీల్ చైర్ అందచేత**

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్రాపూర్ తండాలో రాజు అనే వ్యక్తికి వెన్నముక విరిగిపోయి నడవరాని పరిస్థితిలో ఉండటంతో ఆదరణ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం అధ్యక్షురాలు కర్ర పావని, రవి వీల్ చైర్‌ను అందచేశారు. ఆదరణ సేవాసమితి ఆధ్వర్యంలో అనేక సేవలు అందిస్తున్నామని ఆమె తెలిపారు.

- **పోలీసులకు కృతజ్ఞతలు**

మెట్‌పల్లి: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల నుంచి అదృశ్యమైన విద్యార్థిని కేసు విషయంలో స్థానిక పోలీసులు చూపిన చొరవ పట్ల శుక్రవారం ట్రస్మా సభ్యులు డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామారావు, మహర్షి, దొంతుల రాజ్‌కుమార్, ప్రదీప్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్, ముత్తయ్యరెడ్డి, వేణు తదితరులున్నారు.

- **చెక్కు అందజేత**

బుగ్గారం: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తొవిటి రవి ఆగస్టు 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ప్రమాద బీమా కింద రూ.2లక్షలు మంజూరు కాగా, మృతుడి భార్య లక్ష్మికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- **ప్రత్యేక గ్రామపంచాయతీ కోసం సర్వే**

కథలాపూర్: మండలంలోని అంబారిపేట గ్రామానికి అనుబంధంగా ఉన్న గిరిజన తండాను ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటు చేసే విషయంలో అధికారులు శుక్రవారం సర్వే చేశారు. గిరిజన తండా పరిధిలో భూమి ఎంత ఉందని సర్వే నెంబర్ల వారీగా వివరాలు సేకరించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివరాలు సేకరించామని సర్వేయర్ రమేశ్, కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు.

- **విద్యార్థులకు బ్లాంకెట్లు పంపిణీ**

ధర్మపురి: చలి కాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం సప్లై చేసిన బ్లాంకెట్లను, వాటర్ హీటర్లను శుక్రవారం పంపిణీ చేశారు. ధర్మపురి, బుగ్గారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలకు చెందిన విద్యార్థినులకు మండల విద్యాధికారులు సీతామహాలక్ష్మి, వెంకటేశ్వర్లు స్థానిక కేజీబీవీ పాఠశాలలో పంపిణీ చేశారు.

ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్సీ కృషి



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధిలో ఎమ్మెల్సీ కవిత కృషి మరవలేనిదని జిల్లాపరిషత్ మాజీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. దుబ్బరాజన్న ఆలయ రాజగోపురం, ప్రాకార నిర్మాణ పనులు శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అతిపెద్ద శైవ క్షేత్రంగా ఉన్న దుబ్బరాజన్న ఆలయ అభివృద్ధికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యురాలిగా కవిత ఉన్న సమయంలో మన ఊరు–మన ఎంపీ కార్యక్రమంలో భాగంగా ఆలయాన్ని సందర్శించి రూ.86 లక్షలు మంజూరు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. దుబ్బరాజన్నతో పాటు బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు సాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తేలు రాజు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సాగి సత్యంరావు, యువజన విభాగం మండల అధ్యక్షుడు మదన్ సిలివేరీ, ఎండబెట్ల ప్రసాద్, బండారి వెంకటేశ్, తోడేటి గోపాల్‌కిషన్, సిగిరి రాజిరెడ్డి వొడ్నాల జగన అత్తినేని నరేశ్, ఆకుల తిరుపతి, సాంబరి గంగాధర్, అరవింద్ గౌడ్, రవిగౌడ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకిచ్చిన హామీలు అమలు చేయాలి



సమ్మెలో పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

జగిత్యాలటౌన్: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజుకు చేరింది. శుక్రవారం ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెలో పాల్గొన్న అశోక్‌కుమార్ వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా అధికారంలోకి వచ్చిన కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను విస్మరించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించి వారిని విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో అన్యాయానికి గురవుతున్న సిబ్బందికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెల్మల ప్రకాశ్ రావు, సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సరైన వివరాలు ఇవ్వాలి

కథలాపూర్: మండలంలోని అంబారిపేట గ్రామ పరిధిలో సూరమ్మ ప్రాజెక్టు కాలువ పనుల భూనిర్వాసితులు సరైన వివరాలు ఇవ్వాలని కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణపై శుక్రవారం అంబారిపేటలో గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి చెందిన 73 ఎకరాలు కాలువ పనుల్లో కోల్పోతారని అధికారులు వివరించారు. సర్వే నంబర్లు తప్పుగా ఉంటే సవరణ చేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నాగేశ్, మురళి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలి

జగిత్యాలటౌన్: పెండింగ్ బిల్లులతో పాటు 6 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, లేకుంటే ఈనెల 16,17వ తేదీల్లో వంట మానేసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ప్రతినిధి ఇందూరి సులోచన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పెండింగ్ వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు చెల్లించాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్, జిల్లా విద్యాధికారి కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా సులోచన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు రూ.10వేల వేతనం, గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటాచారి, కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని మరమ్మతుల దృష్ట్యా టౌన్–1 సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ రాజిరెడ్డి తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస, కల్లెడ, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్లలో పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పొలాస ఏఏఈ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలోని పెగడపల్లి, ఏడుమోటపల్లి తాండా, నామాపూర్, మ్యాకవెంకయ్యపల్లి, నరసింహునిపేట, వెంగళాయిపేట గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకట్‌రెడ్డి తెలిపారు.

మెట్‌పల్లి: పట్టణంలోని పాత బస్టాండ్, వెల్లుల్ల రోడ్, శాంతినగర్, రెడ్డి కాలనీ, చైతన్యనగర్, అంబేడ్కర్‌నగర్, సాయిరాంకాలనీ, ఇందిరానగర్, ఏకలవ్యనగర్, బీడీ కాలనీ, మఠంవాడ, సింగాపూర్‌లో శనివారం ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ అమరేందర్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి సబ్‌స్టేషన్ లో పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన తెలిపారు.

నేడు తిమ్మాపూర్‌లో జిల్లా స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో శనివారం జగిత్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్ ఆసోషియేషన్ ప్రధాన కార్యదర్శి ఎలేటి ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షుడు జి.రామ్‌దాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఉదయం 7 గంటలకు రిపోర్టు చేయాలని వారు కోరారు.

సీఎం కప్ జిల్లా పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయికి ఎంపికైన వర్షకొండ విద్యార్థులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటలక్ష్మి తెలిపారు. ఈనెల 11 నుంచి 13 వరకు జగిత్యాల మినీ స్టేడియంలో జరిగిన సీఎం కప్ జగిత్యాల రూరల్ మండలస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి 21 వరకు జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను శుక్రవారం హెచ్‌ఎం లతదేవి, ఎస్ఎంసీ చైర్మన్ నీరటి సుకన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మండల స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజేందర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 16న జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు: మల్యాల మండలం తాటిపల్లి గురుకుల పాఠశాలలో ఈ నెల 11,12న మండల స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహించారు. మల్యాల బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ లో ప్రథమ స్థానం, ఖో ఖో లో ద్వితీయ స్థానం సాధించారు. ఈ నెల 16 నుండి 21 వరకు జగిత్యాలలో జరగనున్న జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం అనుపమ, చైర్మన్ ఆర్షణపల్లి రజిత, పీడీ విశ్వ ప్రసాద్ అభినందించారు.

కొవ్వొత్తులతో నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

కోరుట్ల: బంగ్లాదేశ్‌లో చనిపోయిన హిందువులకు సంతాప సూచకంగా కోరుట్ల హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని కార్గిల్ చౌరస్తా వద్ద శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం, హిందూ ఐక్యవేదిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

కోరుట్ల: పట్టణంలోని రుద్ర వసంత్ గృహంలో శుక్రవారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాముల భజనలు, కీర్తనలు పేటతుళ్లి ఆకట్టుకున్నాయి, కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ స్వామి, గురు స్వాములు జుంబర్తి రమేశ్ గట్ల ఆనంద్, తోట రాజు, గడ్డం మధు, తదితరులు పాల్గొన్నారు.